సాక్షి కామారెడ్డి

గురువారం । 20 । జూలై । 2023



ఆర్థికంగా బలోపేతం కావాలి

మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు సూచించారు.

- 8లో ▸



12 గంటలూ ఇస్తలేరు..

వ్యవసాయానికి 12 గంటల పాటు కూడా విద్యుత్ ఇస్తలేరని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
27.4 /22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఆహ్లాదకర గాలులు వీస్తాయి. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కొట్టుకుపోయిన రోడ్డు



తాడ్వాయి: వర్షాలతో వాగులు పారుతున్నాయి. దీంతో బ్రాహ్మణపల్లి శివారు, కాళోజీవాడి శివారు ప్రాంతాలలో నిర్మిస్తున్న రెండు బ్రిడ్జిల పక్కన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్లు బుధవారం కొట్టుకుపోయాయి. రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. బ్రాహ్మణపల్లి గ్రామస్తులు కామారెడ్డికి వెళ్లడానికి దేవాయిపల్లి, కృష్ణాజీవాడి గ్రామాల మీదుగా వెళ్లాల్సి వస్తోంది. కాళోజీవాడి, చందాపూర్, సంగోజీవాడి గ్రామాల ప్రజలు తాడ్వాయి మీదుగా కామారెడ్డికి వెళ్లాల్సి వస్తోంది.

'అహంకారంతో మాట్లాడుతున్నారు'



కామారెడ్డి టౌన్: ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అధికారం ఉందన్న అహంకారంతో మాట్లాడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ అహంకారంతోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. రాహుల్ గాంధీకి ఎడ్లు, వడ్లు తెలవదన్న కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించారు. మళ్లీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహమ్మద్ ఇసాక్, పంపరి లక్ష్మణ్, వలపు శెట్టి భాస్కర్, రమేష్, మదర్, గణేశ్ నాయక్, లక్కపత్తిని గంగాధర్ పాల్గొన్నారు.

23న 'గ్రహ శకలాల అన్వేషణ' క్విజ్ పోటీ




కామారెడ్డి టౌన్: ఆర్యభట్ట సైన్స్ క్లబ్, ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్ సెర్చ్ (నాసా) సహకారంతో 23వ తేదీన జిల్లా కేంద్రంలోని భవిత స్కూల్‌లో క్విజ్ పోటీలను నిర్వహిస్తారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. బుధవారం పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 9, 10 తరగతుల విద్యార్థులు పోటీలకు అర్హులన్నారు. ఇందులో ప్రతిభ చూపేవారికి వచ్చేనెలలో జరిగే గ్రహశకలం శోధన ప్రచారంలో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు 92469 13331, 70138 50900 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దిరామిరెడ్డి, ఆర్యభట్ట కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఖత్రి, రామన్ స్కాటర్స్ సైన్స్ క్లబ్స్ కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, ప్రతినిధులు రాజు, శ్రీదర్, స్వర్ణలత పాల్గొన్నారు.

బాన్సువాడ ఆర్డీవోగా భుజంగరావు



సాక్షి, కామారెడ్డి: బాన్సువాడ ఆర్డీవోగా వి.భుజంగరావు నియమితులయ్యారు. వేములవాడ ఆలయ అభివృద్ధి సంస్థ కార్యదర్శిగా ఉన్న భుజంగరావును బాన్సువాడ ఆర్డీవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేసిన రాజాగౌడ్ ఇటీవల బోధన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే.

పోలీస్ వాహనాన్ని ఢీకొట్టిన లారీ



బాన్సువాడ: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. రూట్ ఎస్కార్ట్‌లో భాగంగా హోంగార్డు సాయన్న, ఏఆర్ పీసీ ఎల్లారెడ్డితో కలిసి వాహనంలో అంబేడ్కర్ చౌరస్తానుంచి పాతబాన్సువాడ వైపు వెళ్తుండగా.. తాడ్కోల్ చౌరస్తా వైపునుంచి అతివేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఎస్కార్టు వాహనం ఎడమవైపు రెండు డోర్లు, మెయిన్ గ్లాస్, డిజిల్ ట్యాంకు, బానెట్, ఇంజిన్‌లు దెబ్బతిన్నాయి. ఎస్కార్ట్ వాహనం డ్రైవర్ సాయన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

'పోచారం'లో పెరుగుతున్న నీటిమట్టం



పోచారం ప్రాజెక్టులోకి వచ్చి చేరిన వరదనీరు

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రెండురోజులుగా ఎగువప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వరదనీరు పోచారం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. మంగళవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లింగంపేట పెద్దవాగు ద్వారా భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. బుధవారం సాయంత్రం 3,204 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు.



నస్రుల్లాబాద్: నెమ్లిలో వరద నీటిలో మునిగిన పంట పొలాలు

తెరిపి లేని వాన!

బాన్సువాడ రూరల్: అలుగు పారుతున్న బోర్లం చెరువు



- మూడు రోజులుగా ముసురు
- పొంగుతున్న వాగులు
- చెరువులు, ప్రాజెక్టుల్లోకి చేరుతున్న నీరు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో మూడు రోజులుగా తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు పొంగుతున్నాయి. చెరువులు, కుంటల్లోనే కాదు ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం మొదలైంది. మొన్నటిదాకా ఉన్న లోటు వర్షపాతం ఒక్కసారిగా సాధారణ వర్షపాతాన్ని దాటింది. ఈ సీజన్‌లో బుధవారం నాటికి 283.1 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉండగా.. 302.4 మి.మీ., వార్షం కురిసింది. జిల్లాలో బుధవారం సరాసరిన 46.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడింది. ముసురు వల్ల జనం ఇళ్లకే పరిమితమయ్యారు. జిల్లా కేంద్రంలో వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. అయ్యప్పనగర్ ప్రాంతంలో నీరంతా రోడ్ల మీద చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎన్జీవోస్ కాలనీ, విద్యానగర్ ప్రాంతాల్లో కూడా వర్షపు నీరు రోడ్ల మీద నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం కూడా రోజంతా వర్షం కురుస్తూనే ఉండడంతో రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లలేక ఇంటి వద్దే ఉన్నారు.

ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. లింగంపేట వద్ద ఉన్న పెద్ద వాగు ఉధృతంగా పారుతోంది. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోని వాగుల్లోనూ వరద పెరిగింది. ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో వస్తోంది. చెరువులతోపాటు నిజాంసాగర్, పోచారం, కౌలాస్ నాలా, కల్యాణి ప్రాజెక్టులు, సింగితం రిజర్వాయర్‌లు జలకళ సంతరించుకుంటున్నాయి.

'కల్యాణి' గేటు ఎత్తివేత



కల్యాణి గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కల్యాణి ప్రాజెక్టులోకి వరద పెరగడంతో బుధవారం ఒక గేటును ఎత్తి మంజీర నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో ముందు జాగ్రత్తగా ప్రాజెక్టు గేటు ఎత్తి 80 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409.5 మీటర్లు కాగా ప్రస్తుతం 408.5 మీటర్ల మేర నీరు నిల్వ ఉందన్నారు.



లింగంపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు



మాచారెడ్డి : పాత వంతెనపైనుంచి ప్రవహిస్తున్న పాల్వంచవాగు

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు..

మండలం	వర్షపాతం (మి.మీ.)				
నస్రుల్లాబాద్	69.9	భిక్కనూరు	53.1	బీబీపేట	37.5
గాంధారి	69.5	రాజంపేట	49.8	పాల్వంచ	37.2
సదాశివనగర్	69.1	బీర్కూర్	48.7	పెద్దకొడప్‌గల్	34.4
నాగిరెడ్డిపేట	62.5	ఎల్లారెడ్డి	46.8	దోమకొండ	32.7
బాన్సువాడ	58.8	తాడ్వాయి	46.6	జుక్కల్	32.0
కామారెడ్డి	58.2	రామారెడ్డి	45.3	బిచ్కుంద	29.2
లింగంపేట	56.6	మాచారెడ్డి	44.0	డోంగ్లీ	28.8
		నిజాంసాగర్	43.7	మద్నూర్	23.3
		పిట్లం	38.3		


ప్రాజెక్టులకు జలకళ

నిజాంసాగర్: జిల్లాలోని ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు మంజీర నది పారుతోంది. ఆ నీరు నిజాంసాగర్ ప్రాజెక్టును చేరుతోంది. బుధవారం ఉదయం 1,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. సాయంత్రానికి 1,700 క్యూసెక్కులకు చేరింది. రాత్రి 9 గంటల ప్రాంతంలో 1,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిందని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. మూడు రోజులుగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. బుధవారం రాత్రికి 1,388.45 అడుగుల(3.490 టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు. ప్రధాన కాలువ ద్వారా వంద క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు వదులుతున్నామన్నారు.

కౌలాస్‌లోకి 323 క్యూసెక్కులు..

మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో కురుస్తున్న వర్షాలతో జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి బుధవారం 1,759 క్యూసెక్కుల వరద వస్తోందని ప్రాజెక్టు ఏఈఈ రవి శంకర్ తెలిపారు. కౌలాస్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీ) కాగా.. బుధవారం సాయంత్రానికి 456.10 మీటర్ల(0.821 టీఎంసీ) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం



నటేశ్వరశర్మకు దాశరథి అవార్డు

- 22న ప్రదానం చేయనున్న ప్రభుత్వం
- అభినందనలు తెలిపిన సీఎం కేసీఆర్



డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

కామారెడ్డి అర్బన్: ప్రతిష్టాత్మకమైన దాశరథి కృష్ణమాచార్య అవార్డుకు కామారెడ్డికి చెందిన ప్రఖ్యాత కవి, రచయిత, సంస్కృత అష్టావధాని డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 22న రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే దాశరథి జయంతి ఉత్సవాలలో అవార్డును ప్రదానం చేయనున్నారు. అవార్డుతోపాటు రూ. 1,01,116, జ్ఞాపిక అందించనున్నారు. దాశరథి అవార్డుకు ఎంపికైనందుకు సీఎం కేసీఆర్ నటేశ్వరశర్మకు అభినందనలు తెలిపారు.

అయాచితం నటేశ్వరశర్మ కామారెడ్డి ప్రాచ్య విద్యా పరిషత్ ప్రాచ్య కళాశాలలో 1977 నుంచి సంస్కృత విభాగాచార్యులుగా, ప్రధానాచార్యులుగా పనిచేసి 2014లో ఉద్యోగ విరమణ పొందారు. ఓయూలో 2011 నుంచి 2013 వరకు ప్రాచ్యభాషా విభాగానికి పీఠాధిపతి(డీన్)గా పనిచేశారు. ఆది శంకరాచార్యుల 'సౌందర్యలహరి'పై పరిశోధనకుగాను 1994లో ఓయూ డాక్టరేట్ పట్టా, స్వర్ణపతకం బహూకరించింది. ఆయన ఆముక్తమాల్యదపై విమర్శ గ్రంథం రాశారు. నటేశ్వరశర్మ రాసిన 'శకుంతల' కావ్యానికి తెలుగు యూనివర్సిటీ ఉత్తమ కావ్య పురస్కారం దక్కింది. తెలంగాణలోని 33 జిల్లాల ప్రత్యేకతలను తెలుపుతూ రాసిన పద్యాలు బహుళ ప్రాచుర్యం పొందాయి. తెలంగాణ రాష్ట్ర వైభవాన్ని ప్రస్తుతిస్తూ సంస్కృతంలో రాసిన 'తెలంగాణ సుప్రభాతమ్' తెలంగాణ మాస పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైంది. ఆయన 1981 నుంచి ఇప్పటివరకు సంస్కృతంలో వందకుపైగా అష్టావధానాలు నిర్వహించారు. తెలుగు, సంస్కృతంలో 50కిపైగా వచన, గేయ, పద్య సంకలనాలు, శతకాలు, ఖండ కావ్యాలు, విమర్శలు, విశిష్ట రచనలు చేశారు. ఆయన రాసిన సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు వివిధ దినపత్రికల్లో ప్రచురితమయ్యాయి. పలుమార్లు సాహితీ పురస్కారాలు, అవార్డులు అందుకున్నారు.

సాహితీ సేవకు గుర్తింపు..

ప్రతిష్టాత్మకమైన దాశరథి కృష్ణమాచార్యుల అవార్డుకు ఎంపిక చేసినందుకు సంతోషంగా ఉందని అయాచితం నటేశ్వర శర్మ పేర్కొన్నారు. కవి, రచయిత, అష్టావధానిగా అనేక సన్మానాలు, బిరుదులు, అవార్డులు పొందినప్పటికీ.. మహానుభావుడు దాశరథి కృష్ణమాచార్యుల పేరిట అందిస్తున్న ప్రభుత్వ అవార్డుకు ఎంపికవడం సాహితీ సేవలకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. సీఎం కేసీఆర్ అభినందనలు తెలపడం మరచిపోలేని విషయమని పేర్కొన్నారు.

బోగస్ ఓటర్లు లేకుండా చూడాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులు బాధ్యత తీసుకోవాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడవలసిన బాధ్యత రాజకీయ పార్టీల ప్రతినిధులపై ఉందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీలలో ఓటర్ల నమోదుకోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఓటరు నమోదు కోసం పోలింగ్ కేంద్రాలలో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లునిండే యువతీ యువకులు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారు చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో 40 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రస్తుతం వాటిని పరిశీలిస్తున్నామని తెలిపారు. ఫాం 8 ద్వారా ఓటర్ల చిరునామాలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఎలక్ట్రానిక్ యంత్రాలపై ఎలాంటి అపోహలు అవసరం లేదన్నారు. 10 శాతం యంత్రాలను గ్రామ స్థాయిలో అవగాహన కల్పించడం కోసం వినియోగిస్తామన్నారు. ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత పార్టీలపై ఉందన్నారు. చనిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించడానికి నాయకులు బీఎల్‌వోలకు సహకరించాలని కోరారు. ఆగస్టు 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటిస్తామని, అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, సురేష్, అనిల్ కుమార్, ఖాసీం అలీ, బాల్‌రాజు, జిల్లా ఎన్నికల పర్యవేక్షకుడు సాయిభుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కామారెడ్డి క్రైం: జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వర్షాల కారణంగా గ్రామాల్లో సమస్యలు ఏర్పడితే కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూంకు(08468 220069) సమాచారం అందించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ ఉండవద్దని వాగులు ఉధృతంగా ప్రవహించే ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు.

ముమ్మరంగా వరి నాట్లు

నిజాంసాగర్: తుపాను ప్రభావంతో మూడు రోజు ల నుంచి కురుస్తున్న వర్షాలతో సాగు పనులు జోరందుకుంటున్నాయి. బోర్లు, బావుల కింద ఇప్పటికే నాట్లు పూర్తవగా.. జిల్లాలోని నిజాంసాగ ర్, పోచారం, కౌలాస్‌నాలా, కల్యాణి ప్రాజెక్టు, సింగితం రిజర్వాయర్ ఆయకట్టుతోపాటు చెరువులు, కుంటల కింద వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో 3.61 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 3.16 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని వ్యవసాయశాఖాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సోయా, పత్తి, మొక్కజొన్న పంటల సాగు పూర్తవగా ప్రస్తుతం వరి నాట్లు ఊపందుకున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో లక్ష్యాన్ని మించి పంటలు సాగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా వరి నాట్లు, వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా కనిపిస్తున్నారు.



ట్రాక్టర్‌తో పొలాన్ని దమ్ము చేస్తున్న దృశ్యం



నారు తీస్తున్న కూలీలు..



నాట్లు వేస్తూ..

యూసీసీకి మద్దతివ్వాలి



జిల్లా కేంద్రంలో యూసీసీకి మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

- బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకట రమణారెడ్డి
- జిల్లా కేంద్రంలో ర్యాలీ

కామారెడ్డి టౌన్: యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ)కు మద్దతుగా జిల్లా కేంద్రంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో సీఎస్ఐ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ.. కొత్తబస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, స్టేషన్‌రోడ్, సిరిసిల్లరోడ్, మాయాబజార్, సుభాష్‌రోడ్‌ల మీదుగా బస్టాండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. దేశ పౌరులందరికి ఒకే చట్టం వర్తించాలన్నారు. యూసీసీపై అపోహలు వద్దన్నారు. యూసీసీతో వివాహం, విడాకులు, వారసత్వం వంటి విషయాలలో దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తిస్తుందన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా కొత్త చట్టం తెస్తున్న కేంద్ర ప్రభుత్వానికి అందరూ మద్దతుగా ఉండాలని కోరారు. కొన్ని పార్టీలు మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూస్తే మోదీ ప్రభుత్వం వారిని అందరితో సమానంగా చూస్తోందన్నారు. ఈ చట్టం వల్ల ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులలో ఎవరికీ నష్టం ఉండదని పేర్కొన్నారు. ర్యాలీలో కౌన్సిలర్లు శ్రీకాంత్, శ్రీనివాస్, రవి, నరేందర్, ప్రవీణ్, యూసీసీ మద్దతుదారులు భరత్, సురేష్, విపుల్, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీజీ పరీక్షలు ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఐఎంబీఏ, ఏపీఈ, పీసీహెచ్ (ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు), ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 49 మంది విద్యార్థులకు 49 మంది హాజరైనట్లు ఆమె తెలిపారు.

25 నుంచి ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ 1వ, 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు జూలై 25 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

నేడు బెస్ట్ అవైలబుల్ స్కీం లక్కీ డ్రా

నిజామాబాద్‌అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కీంలో ప్రవేశాలకు సంబంధించిన లక్కీ డ్రాను గురువారం నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటి, ఐదో తరగతిలో ప్రవేశాల కోసం స్వీకరించిన దరఖాస్తులకు లక్కీ డ్రా చేపడుతున్నట్లు చెప్పారు. ఉదయం 10.30కు ఒకటో తరగతి, మధ్యాహ్నం 12 గంటలకు ఐదో తరగతి వారికి కలెక్టరేటు ప్రజావాణి సమావేశపు హాల్ డ్రా ఉంటుందన్నారు.

నాణ్యమైన సేవలే లక్ష్యం



బోధన్‌రూరల్: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి విద్యుత్ సంస్థను లాభాల్లో నడిపించడమే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఈశ్వరయ్య అన్నారు. బుధవారం సాలూర సబ్ స్టేషన్‌లో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కరెంట్ సప్లయ్‌లో అంతరాయం, మీటర్ రీడింగ్‌లో ఇబ్బందులు, బిల్లులు ఎక్కువ రావడం, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుల్లో జాప్యం వంటి సమస్యల పరిష్కారం కోసం ఈ వేదికలు ఉపయోగపడతాయన్నారు. వినియోగదారుల నుంచి 10 వినతులు సేకరించామన్నారు. టెక్నికల్ మెంబర్ అశోక్, ఫైనాన్స్ మెంబర్ కిషన్, ఫోర్త్ మెంబర్ భూమారెడ్డి, బోధన్ ట్రాన్స్‌కో డీఈ ముక్తార్, ఏడీఈ బెనర్జీ, ఏఈ కళ్యాణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్‌నాగారం: వర్షాలు కురుస్తున్నందునా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో విధిగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్‌లో స్థాయి సంఘ సమావేశంలో విద్య, వైద్యంపై ఆయన సమీక్షించారు. మలేరియా, డెంగీ ఇతర వ్యాధుల బారిన పడిన వారికి అత్యవసరంగా చికిత్స అందే విధంగా చూడాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో, ల్యాబ్‌ల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనిపై నియంత్రణ ఉంచాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. జెడ్పీ సీఈవో గోవింద్, జెడ్పీటీసీలు సుమనరెడ్డి, భారతి, మహిళా శిశు కమిటీ చైర్‌పర్సన్ దాసరి లావణ్య, డీఎంహెచ్‌వో సుదర్శనం, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమరాజ్, ఆయుష్ జిల్లా అధికారి రామ్మోహన్, ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ పాల్గొన్నారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్ సీజ్

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి శివారులో తారు రోడ్డుపై కేజీవీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ బుధవారం తెలిపారు. వెల్లుట్లపేట గ్రామానికి చెందిన రాజు యాదవ్ కేజీవీల్ ట్రాక్టర్‌ను తారురోడ్డుపై నడపటంతో కేసు నమోదు చేశామన్నారు.

స్కీం ప్రైజ్‌లు వచ్చాయా?

- లక్కీ డ్రా స్కీంలలో సభ్యులకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్
- స్కీం డబ్బు 15 రోజుల్లో చెల్లించాలని ఆదేశించిన మంత్రి
- నిర్వాహకులు స్పందిస్తున్నారా అని క్రాస్ చెక్ చేస్తున్నారనే భావన



మోర్తాడ్: 'హలో మీరు పలానా స్కీంలో చేరి ప్రతి నెలా డబ్బులు చెల్లించారు కదా నిర్వాహకులు బహుమతి గానీ సొమ్ము ఏమైనా వాపసు చేశారా'.. అంటూ గుర్తు తెలియని వ్యక్తులు స్కీంలలో సభ్యులుగా చేరిన వారికి ఫోన్‌లు చేసి సమాచారం సేకరిస్తున్నారు. స్కీం నిర్వాహకులలో ఎక్కువ మంది అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారు ఉండటంతో లక్కీ డ్రా నిషేధమైనా పోలీసులు ఎదురు చెప్పలేకపోయారు. ఇదే అవకాశంగా భావించిన కొందరు అక్రమార్కులు స్కీంల డబ్బులను తమ సొంతానికి వాడుకుని సభ్యులకు బహుమతులు ఇవ్వకపోవడం, వారి నుంచి తప్పించుకు తిరగడం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నాయకులే స్కీంల నిర్వాహకులుగా వ్యవహరిస్తుండటంతో అధికార పక్షం చూసి చూడనట్లు వ్యవహరించిందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'స్కీంల పేరుతో స్కాం' అనే శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనంతో మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్పందించి స్కీం డబ్బులు లేదా బహుమతులను సభ్యులకు అందించాలని ఆదేశించారు. 15 రోజుల్లో సమస్య పరిష్కారం కావాలని సూచించారు. ఇదే తరుణంలో వివిధ గ్రామాలలో ఉన్న సభ్యులకు కొత్త కొత్త నంబర్ల నుంచి ఫోన్లు వస్తున్నాయి. స్కీం డబ్బులు వాపసు వచ్చాయా, ఎంత చెల్లించారు మీకు ఎంత వాపసు వచ్చింది, లేదా బహుమతులు ఇచ్చారా అనే విషయాలను ఫోన్‌లు చేసిన వారు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. స్కీం నిర్వాహకులకు మంత్రి అల్టిమేటం ఇవ్వడంతో అధికార పక్షమే ముందు జాగ్రత్తగా స్కీం సభ్యుల నుంచి సమాచారం సేకరిస్తుందా అనే సందేహం వ్యక్తమైతుంది. ఇది ఇలా ఉండగా గడువులోగా సభ్యులకు న్యాయం జరుగకపోతే అధికార బీఆర్‌ఎస్‌ను ఇబ్బంది పెట్టడానికే ప్రతిపక్ష పార్టీల నాయకులే స్కీం సభ్యులకు ఫోన్‌లు చేస్తున్నారా అనే అనుమానం తలెత్తుతుంది. వీలైనంత తొందరగా స్కీంల సమస్యను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ అధిష్టానం భావిస్తే గడువు తీరేలోగా సభ్యులకు న్యాయం జరగకపోతే ఆందోళనలు చేయాలని ఇతర పార్టీల నాయకులు ఆలోచిస్తున్నారు.

కల్లును మత్తు పానీయాల జాబితా నుంచి తొలగించాలి



కామారెడ్డి జిల్లా కేంద్రంలో సమావేశమైన మోకుదెబ్బ సభ్యులు

- మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమర వేణి నర్సాగౌడ్

కామారెడ్డి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కల్లును మత్తు పానీయాల జాబితా నుంచి తొలగించాలని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గుమాస్తా కాలనీలో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు కొండగొని రవీందర్ గౌడ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ అమర వేణి నర్సాగౌడ్ హాజరై మాట్లాడారు. గీత కార్మికులకు సేఫ్టీ మోకులను ఉచితంగా పంపిణీ చేయాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జనగామ జిల్లాగా మార్చాలని, గీత కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. అన్ని రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలో చలో హైదరాబాద్ పేరిట రాజధానిలో భారీ సభలు నిర్వహిస్తామన్నారు. నేతలు కోడూరి సాయ గౌడ్, బక్కొల్ల బాలగౌడ్, రమాగొని రాజేశ్వర్ గౌడ్, అధికం రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

21న ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 21న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌లోని వరుణ్ మోటార్స్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, సర్వీసెస్ అడ్వైజర్స్/టెక్నిషియన్స్ ఉద్యోగాలున్నాయి. విద్యార్హత ఎంబీఏ/డిగ్రీ/ఐటీఐ/డిప్లొమా. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు జిల్లా ఉపాధి కార్యాలయానికి రావాలని, ఇతర వివరాలకు 6305743423, 9959456793, 9581768413 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అరెస్టు వారెంటు జారీ చేసిన కోర్టు

బిచ్కుంద: హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన నల్లపనేని అంజిబాబుపై బిచ్కుంద కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గతంలో బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో అంజిరెడ్డిపై కేసు నమోదైంది. నిందితుడు కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది.

వర్షానికి కూలిన ఇళ్లు



ఎడపల్లి: వర్షానికి మండలంలోని జానకంపేటలో బుధవారం రెండు ఇళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన సిరిప లింగం, గంగమణి ఇళ్లు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసి కూలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. నేలకూలిన ఇళ్లను ఆర్ఐ వినోద్, ఎంపీటీసీ సంజీవ్, కార్యదర్శి ప్రేమ్‌దాస్, ఉప సర్పంచ్ విజయ్‌కుమార్ పరిశీలించారు.

బాల్కొండ: బాల్కొండకు చెందిన ఎడపల్లి లక్ష్మి ఇల్లు వర్షాలకు కూలింది. పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి కూలిన ఇంటిని పరిశీలించారు. అనంతరం ఆమెకు మున్నూరు కాపు సంఘం ఇంట్లో బస ఏర్పాటు చేశారు.

అందుబాటులో ఆయుర్వేద, హోమియో వైద్యం



మాట్లాడుతున్న వైద్యాధికారిణి ఆస్మా అఫ్షిన్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం జన ఆరోగ్య సమితి(జాస్) కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి ఆస్మా అఫ్షిన్ మాట్లాడుతూ...ఆస్పత్రిలో ఆయుర్వేద, హోమియో వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు ఆస్పత్రి అభివృద్ధికి కావల్సిన పనులపై చర్చించారు. ఇటీవల పీహెచ్‌సీలో కేంద్ర వైద్య బృందం పర్యటించిన నేపథ్యంలో అధికారులు సూచించిన పనుల గురించి చర్చించారు. ఆస్పత్రిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఎంపీటీసీ బీరయ్య వైద్యాధికారి దృష్టికి తెచ్చారు. ఇక నుంచి అలా జరగకుండా చూస్తామని హామీ ఆయన ఇచ్చారు. ఎంపీపీ అనసూయ, వీడీసీ చైర్మన్ కుమ్మరి రాజు, ఆర్ఐ సాహిత్య, ఏపీఎం రాజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, సీహెచ్‌వో నాగరాజు, సూపర్‌వైజర్ నక్షత్ర, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్మూర్‌లో అక్కాచెల్లెళ్ల హత్య

- నగల కోసమే హతమార్చారా!



ఘటన స్థలంలో ఆరా తీస్తున్న ఇన్‌చార్జి సీపీ



రాజవ్వ(ఫైల్) గంగవ్వ(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో బుధవారం జరిగిన జంట హత్యలతో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు. పట్టణంలోని రెండో వార్డు పరిధిలోని జిరాయత్‌నగర్‌లో నివాసముండే రాజవ్వ(72), గంగవ్వ(62) అనే అక్కాచెల్లెళ్లను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చారు. పట్టణానికి చెందిన రాజవ్వ, గంగవ్వ అక్కాచెల్లెళ్లు. రాజవ్వకు 20 ఏళ్ల క్రితం విడాకులు కావడంతో ఒంటరిగా ఉంటుంది. గంగవ్వకు ఇద్దరు కుమారులు శ్రీనివాస్, మహిపాల్ ఉండగా.. శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్‌లో, చిన్న కుమారుడు మహిపాల్ మామిడిపల్లిలో ఉంటున్నారు. గంగవ్వ భర్త 20 ఏళ్ల క్రితం మృతి చెందడంతో అనారోగ్యంతో మంచానపడ్డ అక్క రాజవ్వకు సపర్యలు చేసుకుంటూ ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. మహిపాల్ తన తల్లి గంగవ్వకు నిర్మల్ జిల్లా ముదోల్ ఆస్పత్రిలో మంగళవారం నేత్ర పరీక్షలు చేయించుకుని సాయంత్రం ఇంటి వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయమే ఇద్దరు మహిళలు దారుణ హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగులు ఒంటరిగా ఉంటున్న వారి తలలపై ఆయుధాలతో దాడి చేసి హతమార్చారు. అనంతరం హత్యలను ప్రమాదంగా చిత్రీకరించేందుకు ఇంట్లోని దుస్తులకు నిప్పు పెట్టి జారుకున్నారు. ఇంటి నుంచి పొగలు వస్తుండడంతో స్థానికులు గంగవ్వ కుమారుడు మహిపాల్‌కు సమాచారం అందించారు. అనంతరం లోపలికి వెళ్లిన స్థానికులు పొగల మధ్యన మహిళలను వెతుకుతుండగా హత్యకు గురై విగత జీవులుగా పడి ఉన్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు, ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి జాగిలాలను రప్పించి ఆధారాలు సేకరించారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ

మహిళలను వారిపై ఉన్న నగల కోసమే హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. ఇంటి పక్కన కల్లు కాంపౌండ్ ఉండడంతో అక్కడికి వచ్చే వారే ఒంటరిగా ఉంటున్న మహిళలను హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌చార్జీ సీపీ ప్రవీణ్‌కుమార్ హత్యలు జరిగిన తీరును పరిశీలించారు. అన్ని కోణాల్లో విచారించి నేరస్తులను త్వరగా పట్టుకోవాలని ఆదేశించారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



ఆర్గొండలో ఫిష్ పాండ్‌ను ప్రారంభిస్తున్న డీపీఎం

రాజంపేట: డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఐకేపీ డీపీఎం రమేశ్ బాబు అన్నారు. బుధవారం ఆర్గొండలో మహిళా సంఘ సభ్యురాలైన ఎర్ర కవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిష్ పాండ్‌ను ఆయన ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా సమాఖ్యను ముందుకు తీసుకువచ్చేందుకు కోళ్ల పెంపకం, చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు డీపీఎం తెలిపారు. సర్పంచ్ తమ్మన్నగారి లక్ష్మి, సీసీ సాయిలు, భాగయ్య, సీఏ లక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఉపాధి శిక్షణ తరగతులు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న చేనేత కార్మికులు, గడికోట ట్రస్టు ప్రతినిధులు, అధికారులు

దోమకొండ: చేనేత కార్మికులకు ఉపాధి అందించడానికి వీలుగా నేత కార్మికులకు మగ్గాల నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చేనేత జౌళిశాఖ హైదరాబాద్ ఏడీ పుగలంతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు 45 రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సాంకేతిక శిక్షణను ఇవ్వడానికి ట్రస్టు ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రోగ్రాం డిజైనర్ పవన్ కుమార్, చేనేత జౌళిశాఖ కామారెడ్డి ఏడీ సంతోష్ కుమార్, గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్, గ్రామ సర్పంచ్ నల్లపు అంజలి, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బొమ్మెర లక్ష్మినారాయణ, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో గౌరవం దక్కడం లేదు

బీబీపేట ఎంపీటీసీ ఆవేదన



కొరివి నీరజ

బీబీపేట: బీఆర్‌ఎస్‌లో సరైన గౌరవం దక్కడం లేదని, స్థానిక నాయకులు పార్టీ కార్యక్రమాలకు పిలవడం లేదని బీబీపేట బీఆర్‌ఎస్ ఎంపీటీసీ 2 కొరివి నీరజ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆమె వీడియోలో మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టిన కనీస గౌరవంగా పిలువడం లేదని, పార్టీ నేతలు చిన్నచూపు చూస్తున్నారని ఆమె వాపోయారు. ప్రొటోకాల్ ప్రకారం కూడా పార్టీ కార్యక్రమాలకు పిలవకుండా అవమాన పరుస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ మండల నేతల వల్లే ఇలాంటి అవమానం జరుగుతుందని పేర్కొన్నారు. ఆమె భర్త నర్సింలు వీడియోలో మాట్లాడుతూ స్థానిక పార్టీ నేతలతోనే అవమానం ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే స్పందించాలని కోరారు.

ఆరెకటికె భవనానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి: పట్టణంలో ఆరెకటికె భవన నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం భూమిపూజ నిర్వహించారు. రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనానికి పూజలు చేశారు. పనులను నాణ్యతగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఆరె కటిక సంఘం నాయకులు రాజేష్, తిరుపతి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్యారం పోటీలు



విజేతగా నిలిచిన విద్యుత్ సౌధ జట్టుకు బహుమతులు అందిస్తున్న ఎస్ఈ రవీందర్



తృతీయ స్థానంలో నిలిచిన నిజామాబాద్ జట్టు..

నిజామాబాద్‌నాగారం: నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న విద్యుత్ ఉద్యోగుల క్యారం పోటీలు బుధవారం ముగిశాయి. జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు పోలీస్ పరేడ్ మైదానంలో జరిగాయి. ముగింపు కార్యక్రమానికి ఎస్ఈ రవీందర్ హాజరై మాట్లాడారు. 24 గంటల పాటు విధుల్లో ఉండే ఉద్యోగులు మానసిక ఉల్లాసానికి పోటీలు ఉత్సాహాన్నిస్తాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సూర్యనరసింహారావు, తోట రాజశేఖర్, గంగారాం నాయక్, సురేష్, డీఈలు రాజేశ్వర్‌రావు, వెంకటరమణ, ఉత్తమ్ పాల్గొన్నారు.

గెలుపొందిన జట్లు

క్యారం సింగిల్‌లో ద్వారక(వరంగల్ ఓఎంసీ), ఎండీ ఇలియాస్(నిజామాబాద్), జాకీర్ (విద్యుత్ సౌధ) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. డబుల్స్‌లో ఖలీల్, జాకీర్(విద్యుత్ సౌధ), ద్వారక, శ్రీనివాస్‌రెడ్డి(వరంగల్ ఓఎంసీ), శంకర్, రాజశేఖర్(నిజామాబాద్), రాకేష్, ప్రతాప్(విద్యుత్ సౌధ)ఉన్నారు. ఓవరాల్‌గా విద్యుత్ సౌధ జట్టు గెలుపొందగా, వరంగల్ రెండో స్థానంలో, నిజామాబాద్ తృతీయ స్థానంలో నిలిచాయి.

కారు బోల్తా పడి ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన కారు



సూరజ్ (ఫైల్)

బోధన్‌టౌన్: బోధన్‌లోని బైపాస్ రోడ్డులో బొజ్జ వినాయకుడి ఆలయం సమీపంలో మంగళవారం రాత్రి కారు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. బోధన్‌లోని ఆజంగంజ్ కాలనీకి చెందిన సూరజ్ దాలియా రాహుల్ దాలియా తమ మిత్రుడు యష్‌రాండర్‌తో కలిసి ఆచన్‌పల్లిలో గల దీపక్ స్వీట్ హోంకు వెళ్లారు. అనంతరం యష్ రాండర్‌ను ఇంటి వద్ద వదిలి వేయడానికి ఆచన్‌పల్లి బైపాస్ మీదుగా వెళ్తుండగా గణపతి ఆలయ సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. సూరజ్ దాలియాకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. గాయపడ్డ మిగతా ఆస్పత్రికి తరలించారు. వీరిలో రాహుల్‌కు తీవ్ర గాయాలు కావడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాహుల్ దాలియా తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

బోధన్‌టౌన్: బోధన్‌లోని శక్కర్‌నగర్ చౌరస్తాలో బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సోహైల్ అనే యువకుడు బాలికను ఏడాదిన్నరగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఎవరు లేని సమయంలో బాలిక ఇంట్లోకి చొరబడ్డ యువకుడిని కుటుంబ సభ్యులు పట్టుకొని పోలీసులకు అప్పగించారని చెప్పారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా సదరు యువకుడు ఏడాదిన్నరగా వేధిస్తున్నాడని, ఎవరికి చెప్పుకున్నా అండగా నిలువలేదని బాలిక తండ్రి ఓ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

యువతి కిడ్నాప్

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని పాములబస్తీకి చెందిన యువతిని అదే కాలనీకి చెందిన వికార్ కిడ్నాప్ చేసినట్లు ఎస్సై శ్రావణ్ తెలిపారు. యువతిని బలవంతంగా ఎత్తుకెళ్లినట్లు యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కొంతకాలంగా యువతిని ప్రేమ పేరుతో వేధిస్తున్న వికార్ ఈ నెల 14న కాలేజీకి వెళ్తుండగా కిడ్నాప్ చేశాడు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల నాయకులు ఠాణాకు చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

బిచ్కుంద: మండలంలోని హజ్గుల్‌లో బుధవారం రెవెన్యూ, పోలీస్‌లు ఇసుక డంపులను సీజ్ చేశారు. మంజీర నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక తీసుకొచ్చి గ్రామ శివారులో డంపు చేశారు. గ్రామస్తుల సమాచారం మేరకు 50 ట్రిప్పుల ఇసుక సీజ్ చేశామని తహసీల్దార్ భరత్ తెలిపారు.

రెండిళ్లలో చోరీ




సీసీ టీవీలో నమోదైన అనుమానితులు

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లిలో తాళం వేసిన రెండిళ్లలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన మోతె శ్రీనివాస్ రెడ్డి, మెండె సాయిలుకు చెందిన ఇళ్ల తాళాలు పగులగొట్టి శ్రీనివాస్ ఇంటి నుంచి రూ.20 వేల నగదు, పది తులాల వెండి, సాయిలు ఇంట్లో నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేశామన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రామారెడ్డి: రామారెడ్డిలో బుధవారం పేకాడుతున్న ఇద్దరిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వారి నుంచి రూ.1500 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

విద్యుత్ షాక్‌తో రైతు..



ఫకీర మృతదేహం

ఇందల్వాయి: మండలంలోని మేఘ్యానాయక్ తండాలో లాకవత్ ఫకీర(52) అనే రైతు మంగళవారం ఉదయం తన పొలంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఫకీర తనకున్న రెండున్నర ఎకరాల పొలాన్ని వరి నాట్లు వేసేందుకు సిద్ధం చేసే క్రమంలో బోరుబావి మోటారు స్టార్ట్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైనట్లు చెప్పారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

బైక్ పైనుంచి పడి మహిళ..

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో బుధవారం ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఓ మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన దేవి సావిత్రి(57) తన కొడుకు అరుణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వస్తుండగా, బస్టాండ్ సమీపంలో రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పింది. దీంతో సావిత్రి కింద పడడంతో తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆర్మూర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.